కుక్కలను పట్టి.. వదిలేస్తే ఎలా?

- జీహెచ్‌ఎంసీ సిబ్బంది తీరుపై సర్వత్రా ఆగ్రహం
- కుక్కలు దాడి చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శ



కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడిని పరామర్శిస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ మారుతీనగర్‌లో రిషి(4) అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. ఈ సంఘటనకు సంబంధించి అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది రెండు కుక్కలను పట్టుకున్నారు. అయితే జంతు ప్రియులమంటూ కాలనీలోని కొందరు కుక్కలు పట్టుకున్న వారికి కొంతమొత్తం డబ్బులు ఇవ్వడంతో ఆ రెండు కుక్కలను పక్క గల్లీలో వదిలేసి చేతులు దులుపుకొన్నారని బాధితుడు రిషి తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి, బాలు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుక్కల దాడి జరిగినప్పుడు మేము వెంటనే అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం నుంచి మా కొడుకుని కాపాడుకోగలిగామన్నారు. మరేమైనా జరిగుంటే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. తాము పనిచేస్తున్న అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్నవారు ఇంట్లో పాచిపోయిన ఆహార పదార్థాలను వేయడంతో ఈ ప్రాంతంలో పదులకొద్దీ కుక్కలు సంచరిస్తున్నాయన్నారు.

> నగరంలో వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. వీధుల్లోకి వచ్చే చిన్నారులపై దాడి చేసి చంపేస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో కరిచి గాయపరుస్తున్నాయి. కుక్కలను నియంత్రించే విషయంలో అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

- మంగళవారం అధికారులకు ఫిర్యాదు చేస్తే బుధవారం వచ్చిన కుక్కలు పట్టుకునే సిబ్బంది తమ వద్ద ఫిర్యాదు కూడా తీసుకున్నారని కొద్దిసేపటికి పట్టుకున్న కుక్కలను వదిలివేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం పరిస్థితి ఇంత విషమంగా ఉన్నా తమ కాలనీలో కొందరు కావాలని ఆహార పదార్థాలు వేసి కుక్కలు గుంపులుగా చేరడానికి కారణం అవుతున్నారని ఆరోపించారు.
- మా కొడుకుపై కుక్కలు దాడి చేయడానికి ఆరు నెలల ముందు నుంచే ఆహార పదార్థాలు పెట్టవద్దని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా ఆహారం కుక్కలకు పెడుతున్నారన్నారు. దీంతో గుంపులుగా చేరిన కుక్కలు మా కొడుకుపై దాడికి పాల్పడ్డాయని వాపోయారు. బాలుడి ప్రాణాలు పోతే ఎవరు బాధ్యులని ఆహారం పెట్టే వారిని ప్రశ్నిస్తే మాపై దాడికి ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు.
- అధికారులు క్షేత్రస్థాయిలో తిరగడం లేదని, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. కుక్కలు దాడి చేసి రెండు రోజులు గడుస్తున్నా ఒక్క అధికారి కూడా ఇటువైపు తొంగి చూడకపోవడం వారి పనితనానికి నిదర్శనం అన్నారు. జీహెచ్‌ఎంసీలోని వెటర్నరీ శాఖ వారు పూర్తి నిర్లక్ష్యం వహించడం వల్లే కుక్కలు ఈ ప్రాంతంలో భారీ ఎత్తున సంచరిస్తున్నాయని బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు.
- ఇకనైనా సంబంధి ఉన్నతాధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, కుక్కలు కాలనీలలో సంచరించకుండా భవిష్యత్తులో కుక్కల దాడులు జరగకుండా చూడాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.
- విషయం తెలుసుకున్న కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కమార్ బుధవారం రిషిని పరామర్శించారు. కాలనీలో వీధి కుక్కలు లేకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఆయన ఆదేశించారు.

కుక్కల బెడద నివారించండి



డీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీ అధ్యక్షుడు యాదగిరి

నాగోలు: నాగోలు డివిజన్ జైపురికాలనీ పరిసర ప్రాంతాలలో వీధి కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి వంశరాజ్ కోరారు. బుధవారం జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతి దివాకర్‌కు కలసి వినితిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... జైపురికాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. దీంతో స్థానికులు ముఖ్యంగా పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాత్రి సమయంలో కుక్కలు గుంపులుగా వచ్చి దాడి చేస్తూ పాదచారులు, వాహనాదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నయని తెలిపారు. కుక్కల అరుపులకు స్థానికులకు నిద్ర కూడా కరువవుతోందన్నారు. రాబోయే వేసవిలో పిల్లలు ఇళ్ల బయట ఆడుకుంటున్నప్పుడు వీధి కుక్కల దాడికి గురతారని తల్లిదండ్రులు భయాందోళనతో ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. స్పందించిన డీసీ మారుతి దివాకర్ మాట్లాడుతూ... కాలనీలో వీధి కుక్కలు లేకుండా చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ నేత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం: సామ



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని డివిజన్లలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని.. వాటి పరిష్కారంలో అధికార యంత్రాంగం విఫలం అవుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ కోదండ రాంనగర్‌లోని ఛత్రపతి శివాజీ శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని వారికి భరోసాగా బీజేపీ ఉంటుందని ఈ సందర్భంగా సామ రంగారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ లోతట్టు కాలనీలలో దోమల బెడద, మురుగు నీటి దుర్వాసన వంటి సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. కార్నర్ మీటింగ్‌లలో శక్తి కేంద్రాల వారీగా సమస్యలపై మేనిఫెస్టో తయారు చేసి సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం మెడలు వంచి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమస్యలను పట్టించుకోకుండా కల్వకుంట్ల కుటుంబం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం తథ్యమని జోస్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు నీల ఆనంద్‌కుమార్, లక్ష్మీప్రసాద్, బూత్ కమిటీల అధ్యక్షులు బొమ్మరాజు సందీప్, హరీష్, సంతోష్, సందీప్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ /వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 23, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 35, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 18, దొండ 35, ఆలు 19, ఉల్లి 16, గోకర 45, దోస 28, సొర 13, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 35, అర్వి 70, మునగ 65, చిలగడదుంప 40, బీట్‌రూట్ 15, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యాప్సికమ్ రూ. 48 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి దంపతులు

హస్తినాపురం: అనుపమ నగర్ కాలనీలోని భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సల్లో భాగంగా రెండవరోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి అభిషేకం, చండీహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుడుముల వెంకట్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. చైర్మన్ సతీమణి స్వర్ణలత, భద్రావతి, నాగమణి, శ్రీనివాస్‌రెడ్డి, డి.చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీంద్ర కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. దుర్గాభవానీనగర్, మాదన్నపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఐఎస్‌సదన్, డీఎస్‌నగర్, సెంట్రల్ ఎక్సైజ్, ఈస్ట్ మారుతీనగర్, యాదగిరి నగర్, దుర్గాభవానీనగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ వివరించారు.

ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో...

సైదాబాద్: ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సలీంనగర్, గణేష్ టెంపుల్, హీరోహోండా షోరూం వెనుక ప్రాంతం, రామచంద్రా ఐటీఐ, ఇంద్రసేనారెడ్డి పీటీ, శ్రీపురంకాలనీ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3:30 వరకు వాహెద్‌నగర్, ఓల్డ్‌మస్తాన్ గట్టీ, ఏ టూ జెడ్, అల్లాలా మసీద్, న్యూ వాహెద్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్ కాలనీ, సీబీఐ క్వార్టర్స్, వాటర్ ట్యాంక్, జామియా మసీద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ వివరించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

చంపాపేట: బీఎస్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కార్పొరేటర్ మెద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌లను హెచ్చరించారు. బతుకమ్మ కుంట కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన సర్కిల్ అధికారులతో కలసి సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. కాలనీలో సీసీ రోడ్లు వాల్ టు వాల్ ఏర్పాటు చేయటంతో పాటు నాణ్యతతో పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ రాకేష్, కాలనీ నేతలు సత్యానారాయణ, కృష్ణ, రాజు, జగన్‌మోహన్, వెంకట్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా డబుల్ రోడ్డులోని హియర్‌వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ వద్ద ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కన్సల్టేషన్, వినికిడి స్క్రీనింగ్ పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్ ఉచితంగా నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోన్స్: 97032 35513, 99856 31926లలో సంప్రదించాలని సూచించారు.

నోటరీ, ఓపెన్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు త్వరలో వెసులుబాటు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



నవీన్ మిట్టల్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీవాసులు ఎదుర్కొంటున్న నోటరీ, ఖాళీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమస్యలను త్వరలో జీఓ 118 సవరణ ద్వారా పరిష్కరించనున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను కలసి నోటరీ, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌కు ఉన్న అడ్డంకులను వివరించి జీఓ 118 సవరణ ఆవశ్యకతను వివరించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల ప్రత్యేక చొరవతో 118 జీఓ ద్వార ఇండ్ల రిజిస్ట్రేషన్ సమస్యకు వెసులుబాటు కల్పించారని... జీఓ సవరణ ద్వారా ఓపెన్, నోటరీ ప్లాట్లతో పాటు ఇండ్ల కొనుగోలుదారులకు కూడా రిజిస్ట్రేషన్ అడ్డంకులు తొలుగుతాయని స్పష్టం చేశారు. విదేశాలలో ఉన్న వారు కూడా ఆన్‌లైన్‌లో, చట్టపరంగా హక్కు కలిగిన ప్లాట్ల యజమానుల బంధువుల వ్యక్తిగత పూచీతో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా జీఓ సవరణలో ఆప్షన్ కల్పించాల్సిందిగా నవీన్ మిట్టల్‌ను కోరామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులు

మన్సూరాబాద్: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్82 ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికుల 29 డిమాండ్లు, పీఆర్సీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆటోనగర్‌లోని సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట బుధవారం లంచ్ అవర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... న్యాయమైన ఉద్యోగుల 29 డిమాండ్లను పరిష్కరించి, ఆర్టిజన్ కార్మికుల వేతన సవరణ చేసి పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, శ్రీకాంత్ రెడ్డి, పెద్దులు, శివారెడ్డి, రాజు, శ్రవణ్, జయసుధన్‌రెడ్డి, రాజు, మేకల శ్రవణ్, హరీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'తో ప్రతి పేదకూ ఆరోగ్యబీమా



ఆయుష్మాన్ భారత్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: దేశంలోని ప్రతి పేదకూ ఆరోగ్య బీమా ఇవ్వాలనే మహోన్నతాశయంలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కుంట్లూర్ రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద, వీరన్నగుట్ట, మన్సూరాబాద్ వీకర్ సెక్షన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆయుష్మాన్ భారత్ నమోదు కేంద్రాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... 1350 రకాల చికిత్సలను ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ. 5 లక్షల వరకు వైద్య పరీక్షలు చేయించుకొని, ఉచితంగా మందులు తీసుకోచ్చని తెలిపారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కోటయ్య, నవీన్‌గౌడ్, చిన్నాయాదవ్, మల్లేష్‌యాదవ్, మంగయ్య, కొండల్‌రెడ్డి, సామనాథ్, యాదగిరియాదవ్, సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం

నాగోలు: గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘన బుధవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బుధవారం మధ్యాహ్నం సుమారు 50 సంవత్సరాలున్న ఓ వ్యక్తి ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయం సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. ఉప్పల్ నుంచి ఎల్‌బీనగర్ వైపు వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఆ వ్యక్తిని ఢీ కొట్టింది. దీంతో ఆ వ్యక్తి కింద పడ్డాడు. వెనుక నుంచి వస్తున్న పాల వ్యాను(కేఏ50ఏ2979) అతని మీద నుంచి వెళ్లింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గుర్తు తెలియని ద్విచక్ర వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి బ్లూకలర్ జీన్స్, టీషర్ట్ ధరించి ఉన్నాడు. అతని సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

గురుకుల అధ్యాపక సిబ్బందికి హెల్త్ కార్డులు ఇవ్వాలి



ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చైతన్యపురి: గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఆధ్యాపక సిబ్బందికి హెల్త్ కార్డులు ఇవ్వాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న ప్రొఫెసర్ వినయ్‌బాబు ప్రచార కరపత్రాన్ని చైతన్యపురి సాంఘిక సంక్షేమ మహిళా గురుకులంలో ఆయన ఆవిష్కరించారు. గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి వినయ్‌బాబు కృషి చేస్తున్నారన్నారు. మహిళలకు సీసీఎల్ అలవెన్స్ ఇవ్వాలని, రెండవ శనివారాన్ని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, అనిత, అశ్విని, చంద్రకళ, ఉషారాణి, కృష్ణవేణి, శైలజ, సుజాత, మంగకుమారి తదితరులు పాల్గొన్నారు.

'పొదుపు' పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



టీఏవీ శర్మను సన్మానిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ఎల్‌బినగర్: తపాలా శాఖలో కేంద్ర ప్రభుత్వం అధిక వడ్డీ రేటును అందించే చిన్న మొత్తాల పొదుపు పథకాలలో తక్కువ మొత్తాన్ని డిపాజిట్ చేసి అధిక లాభాలు పొందాలని హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ టి.ఎ.వి.శర్మ అన్నారు. బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం పోస్టాఫీస్‌లో ఏర్పాటు చేసిన చిన్న మొత్తాల మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శర్మ మాట్లాడుతూ... ఈ నెల 24 వరకు వనస్థలిపురం పోస్టాఫీస్‌లో మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఎల్‌బీనగర్‌లోని తపాలా శాఖ కస్టమర్లందరూ పోస్టల్ డిపాజిట్‌లు చేసి లబ్ధి పొందాలని కోరారు. అనంతరం పోస్టల్ ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపాలాశాఖ ఉద్యోగులు సక్కునాయక్, కరుణాకర్‌రెడ్డి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

ఉప్పల్: విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చిలుకానగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ పోల్స్‌ను ఏఈ శ్రీనివాస్, స్థానికులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కొండల్‌రెడ్డి, జగన్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి: బీజేపీ

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తొమ్మిదేళ్లుగా తెలంగాణలో టీఆర్‌ఎస్ ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ, అవినీతి, కుటుంబ పాలన సాగిస్తోందని వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం అనన్యమైందని బీజేపీ మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి అందేలా శ్రీరాములు యాదవ్, ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ కాలనీలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ రాధ ధీరజ్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను కష్టాలు, అప్పుల ఊబిలోకి నెట్టిందే తప్ప ఒరగబెట్టిందేమీ లేదన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని దళితులను నమ్మించి వారిని కూడా కేసీఆర్ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కి అబద్ధాలు, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మిగులు ఆదాయంతో ఏర్పడిన రాష్ట్రాన్ని రూ. 5 లక్షల కోట్ల అప్పుల్లోకి తీసుకెళ్లిన ఘనత సీఎంకే దక్కిందని ఎద్దేవా చేశారు. దేశంలో మరోసారి బీజేపీ పార్టీ అధికారంలో రావడం ఖాయమని, తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంచార్జ్‌లు, బీజేపీ నాయకులు, వివిధ బస్తీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్పీడ్ రీడింగ్ పోటీలు



విద్యార్థులతో డాక్టర్ గోపాల్‌రెడ్డి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో పీపీ–2 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్పీడ్ రీడింగ్‌లో బుధవారం పోటీలు నిర్వహించారు. పిల్లలు అక్షర దోషాలు లేకుండా పుస్తక పఠనంపై నైపుణ్యాన్ని సాధించారని పాఠశాల చైర్మన్, తెలంగాణ గ్రీన్ స్కూల్ అంబాసిడర్ డాక్టర్ కోమటి రెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. స్పీడ్ రీడింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

త్వరలో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీలకు తాగునీటిని అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హయత్‌నగర్ డివిజన్‌లోని షిరిడీ నగర్, సూర్యానగర్, సీతారాంపురం, పరమేశ్వర కాలనీ, దత్తాత్రేయ కాలనీ, మహేశ్వరినగర్, శ్రీరాంనగర్ కాలనీ, పద్మాలయ కాలనీ, మధురానగర్ కాలనీ, ముదిరాజ్ కాలనీ, కమలానగర్, వెంకటాద్రినగర్, శారదానగర్, హైకోర్టు కాలనీ, మీడోస్ కాలనీలలో పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నెల రోజుల వ్యవధిలో ఆయా కాలనీలలో పనులు ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాత నాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. బుధవారం భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి కార్పొరేటర్ కాలనీలో మార్నింగ్ వాక్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిస్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని, కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ సుజాతనాయక్ అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాలచారి, జిలాని, యూనిస్, వహీద్, రమేశ్‌బాబు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోపి రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం యాదగిరినగర్ కాలనీలో పరిసరాల పరిశుభ్రతపై జీహెచ్‌ఎంసీ, రాంకీ గ్రూప్ సంయుక్తంగా క్లీనింగ్ డ్రైవ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... కాలనీలోని ఇళ్ల యజమానులు చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాలు, ఓపెన్ నాలాలలో వేయకుండా అవగాహన కల్పించాటమేగాకుండా ఇండ్లలోని పనికిరాని వస్తువులు, తడి, పొడి చెత్తను తప్పనిసరిగా బాధ్యతతో చెత్తను తరలించే ఆటోవాలాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ శానిటేషన్, రాంకీ సిబ్బంది గణేష్, శరత్ బాబు, ఉపేందర్, నరేష్, ప్రతాప్‌రెడ్డి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.